## క్లుప్తంగా

### బిటివాడ విద్యుత్ ఫీడర్‌ను విభజించండి

వీరఘట్టం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న బిటివాడ ఫీడర్‌ను విభజించాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఫీడర్ 12 పంచాయతీలను కలుపుతూ వెళ్తోంది. అన్ని ఫీడర్ల కంటే బిటివాడ ఫీడర్ పెద్దదిగా ఉండడంతో బ్రేక్‌డౌన్ల సమయంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు, ఈదురుగాలులకు ఈ ఫీడర్ బ్రేక్‌డౌన్ అవుతుండడంతో ఫీడర్ పరిధిలో ఉన్న చిదిమి, పాలమెట్ట, గడగమ్మ, కొట్టుగుమ్మడ గ్రామాలకు ఎప్పటికప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. విద్యుత్ శాఖాధికారులు ఫీడర్‌ను పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

### చిటిక వ్యాధి నివారణకు టీకాలు


పెదభోగిలిలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్య సిబ్బంది

సీతానగరం: తొలకరిలో గొర్రెలు, మేకలను ఆశించే చిటిక వ్యాధి నివారణకు బలిజిపేట, సీతానగరం మండలాల్లో ముందు జాగ్రత్తచర్యలు తీసుకుంటున్నామని పశువైద్యశాఖ సీతానగరం సబ్‌డివిజన్ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలి, బుడ్డిపేట గ్రామాల్లో శుక్రవారం పశువైద్య సిబ్బంది వేస్తున్న చిటిక వ్యాధి నివారణ వ్యాక్సిన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వస్తున్న తొలకరి సీజన్‌లో గొర్రెలు, మేకలకు చిటిక వ్యాధి ఆశిస్తుందని చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలో 37 వేల గొర్రెలు, మేకలున్నాయని, ఏహెచ్ఏలు 33 మంది, 10 మంది పశువైద్య అధికార సిబ్బంది సహకారంతో గొర్రెలు మేకలకు ఈ నెల 15 నుంచి నెలాఖరు వరకూ గ్రామాల్లో ఉదయం, సాయంత్రం వ్యాక్సిన్ వేయనున్నట్లు చెప్పారు. గొర్రెలు, మేకలున్న వారంతా చిటిక వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. గ్రామాలకు వస్తున్న పశువైద్య సిబ్బందికి రైతులు, గొర్రెలు, మేకల యజమానులు సహకరించాలన్నారు.

### ప్రైవేటు వద్దు...ప్రభుత్వ కళాశాలే ముద్దు


బాలగుడబలో అడ్మిషన్ డ్రైవ్‌లో పాల్గొన్న ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు

పార్వతీపురంటౌన్: ప్రైవేటు కళాశాలలు వద్దు..ప్రభుత్వ కళాశాలలే ముద్దు అని ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం నాయకుడు తెర్లి రవికుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలంలోని బాలగుడబ, వీఆర్‌పేట గ్రామాల్లో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్షలు ఖర్చుపెట్టి ప్రైవేట్ కళాశాలల్లో చదివించుకుని డబ్బులు వృథా చేసుకోవద్దని హితవు పలికారు. అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ కళాశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విశాలమైన క్రీడా ప్రాంగణం, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ల్యాబ్ సౌకర్యం ఉన్నాయని వివరించారు. కళాశాలలో అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఉంటుందని చెప్పారు. కళాశాలలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు సైతం నిర్వహించి విద్యార్థులకు మంచి భవిష్యత్ కల్పిస్తున్నామన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులంతా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని కోరారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని, త్వరగా అడ్మిషన్లు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### తాళ్లబురిడిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు


తాళ్లబురిడిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ కౌశిక్

పార్వతీపురం టౌన్: మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించినట్లు డాక్టర్ కౌశిక్ తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 68 మంది రోగులకు వైద్యసేవలు అందించామని చెప్పారు. ఈ విధానంలో గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎనిమిది రకాల రక్తపరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


శిథిలమైన కంప్యూటర్ గది


పెచ్చులూడుతున్న డేటాఎంట్రీ ఆపరేటర్ గది



# అనుక్షణం భయం...భయం

- రోజురోజుకూ కుంగుతున్న తహసీల్దార్ కార్యాలయం భవనం
- వర్షం పడితే ఏ గోడ ముట్టుకున్నా షాక్ కొడుతున్న వైనం
- భయంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది


బ్రిటీష్ కాలం నాటి పాలకొండ తహసీల్దార్ కార్యాలయం (ఇన్‌సెట్లో) కూలిపోయిన కంప్యూటర్ గది పైకప్పు

పాలకొండ:

డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది భయం భయంతో విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని రోజులుగా సిబ్బంది కార్యాలయంలోకి వెళ్లడానికి భయపడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే చిన్నపాటి వర్షానికీ కారిపోయే భవనంలో ఏ గోడ ముట్టుకున్నా షాక్ కొడుతోందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం భవనం బ్రిటీష్ కాలంలో నిర్మించారు. పూర్తిగా కలప, పెంకులతో నిర్మించిన ఈ కార్యాలయ భవనంలో ప్రస్తుతం సమస్యలు తాండవిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి కంప్యూటర్ గది పైకప్పు పూర్తిగా కూలిపోయింది. అయితే రాత్రి సమయంలో పైకప్పు కూలిపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. గతంలో రెండో ద్వారం వద్ద పైకప్పు కిందకు జారిపోయింది. డీటీ కార్యాలయం భవనం పైకప్పు కూడా శుక్రవారం కూలిపోయింది.

**షాక్ కొడుతోంది..**

ప్రస్తుతం కార్యాలయంలో వర్షం నీరు చేరుతోంది. దీంతో సిబ్బంది అంతా ఒకేచోట కుర్చీలు వేసుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం విధులకు వచ్చిన సిబ్బందికి గచ్చుల ద్వారా షాక్ తగిలింది. వెంటనే లైన్‌మన్‌ను పిలిపించగా.. కార్యాలయం గోడలు, గచ్చులకు సైతం విద్యుత్ సరఫరా అవుతోందని గుర్తించి, వెంటనే సరఫరా నిలిపివేశారు.

**మరమ్మతులు చేయలేదు..**

వాస్తవానికి కార్యాలయం దుస్థితిపై గతంలో సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ స్పందించి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేకపోయారు. పాత భవనాన్ని కాపాడుకుంటూనే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలని అప్పటి అధికారులు ప్రయత్నించారు. అయితే ఆ పనులు చేసేవారు అందుబాటులో లేకపోవడంతో పనులు జరగలేదు.

## వ్యర్థాలతో కళాకృతులు..


వ్యర్థాలతో బొమ్మలు, కళాకృతుల తయారీపై తర్ఫీదు ఇస్తున్న ప్రియాంక, గణేష్‌బాబు

పాలకొండ రూరల్: ఇళ్లలో ఉండే వ్యర్థాలను సరిగ్గా వినియోగిస్తే ఆకర్షణీయమైన కళాకృతులు, బొమ్మలుగా మలచవచ్చని ఫ్యాషన్ డైరెక్టర్ ప్రియాంక అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కొబ్బరిపీచు, రంగు కాగితాలు, పనికిరాని గాజులు, ఇతర వస్తువులతో గోడ చిత్రాలు, ఆకృతులు తయారుచేయడంపై శుక్రవారం అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి బి.గణేష్‌బాబు దేశ నాయకులు, రాజుల సాహస గాథలకు సంబంధించిన స్ఫూర్తి కథలు చదివి వినిపించారు.

## శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- డీఈఓ పగడాలమ్మ


డీఈఓ పగడాలమ్మ

కురుపాం: ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కురుపాంలోని ఆదర్శ పాఠశాలలో జిల్లాలో ఉన్న 40 సీబీఎస్ఈ ఉపాధ్యాయులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ తరగతుల పర్యవేక్షణకు వచ్చిన డీఈఓ మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధ్యాయులు శిక్షణ సద్వినియోగం చేసుకోవడంతో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించామని భవిష్యత్‌లో కూడా మంచి ఫలితాలు సాధించేందుకు అంతా కృషి చేయాలని కోరారు. శిక్షణలో సీబీఎస్ఈ స్టేట్ కో ఆర్డినేటర్ శారద, మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, 95 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మక్కువ: మండలంలోని పనసభద్ర గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై డీపీఎం షణ్ముఖరావు, డీపీపీ మానస శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న అనేక రకాల పంటలకు విస్తృతంగా పురుగు మందులు, ఎరువులు వాడడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారన్నారు. నవధాన్యాలతో పంటలు సాగు చేపట్టడంవల్ల ఆరోగ్యకరమైన పంటలు సాగుచేసుకోవచ్చునని తెలిపారు. జీవామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, అగ్నిఅస్త్రం తదితర కషాయాలను రైతులు సొంతంగా తయారుచేసుకుని పంటలు సాగుచేసుకోవాలని కోరారు. దీనివల్ల ఎరువులు, పురుగుమందులకు వెచ్చించే, పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు, మంచి దిగుబడులు వచ్చే పంటలు సాగుచేసుకోవచ్చని చెప్పారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు శాస్త్రవేత్తలు, ఐసీఆర్‌పీలు, మెంటర్స్ పాల్గొన్నారు.

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన వార్షికోత్సవం


శ్రీ వీరబ్రహ్మేంద్ర, గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

సీతానగరం: మండలకేంద్రంలో రాష్ట్రరహదారిని ఆనుకుని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు పోలాకి రాజా నవీన్ ఆధ్వర్యంలో శుక్రవారం వీరబ్రహ్మేందస్వామి ఆరాధన, వార్షిక మహోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు అర్చకుడు రాజానవీన్ మాట్లాడుతూ దేవస్థానం ఉత్సవకమిటీ, వివిధ ప్రాంతాలు, గ్రామాలనుంచి వచ్చిన భక్తుల ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకాలు, ఉదయం 9 గంటలకు మంటపారాధన పూజ, కలశ పూజా పూజ, పుణ్యాహవచనం, స్వామివారి ఆరాధన(సజీవసమాధి) పూజలు నిర్వహించినట్లు తెలియజేశారు. వార్షికోత్సవ పూజలనంతరం దేవస్థానం ఆవరణలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు డాక్టర్ బ్రహ్మచారి, ఆర్. రామకృష్ణ, కె.అప్పారావు, ఎం.శంకరరావు, వి.సత్యనారాయణ, ఎస్. జగదీశ్వరరావు పాల్గొన్నారు.


**పార్వతీపురంలో..**

పార్వతీపురంటౌన్: భూత, భవిష్యత్ వర్తమాన కాలజ్ఞాన ప్రబోధకుడు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 30వ ఆరాధన మహోత్సవాలు పార్వతీపురం పట్టణ విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉదయం పట్టణ ప్రధాన రహదారిలో గల శ్రీ పార్వతీదేవి ఆలయంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ పార్వతీదేవి ఆలయం నుంచి నెయ్యిల వీధిలో గల ఉత్సవ మంటపం వరకు మేళతాళాల మధ్య ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి పూజలు చేశారు.

# పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు..

- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న అన్నదాతలు
- సాగు సలహాలిస్తున్న వ్యవసాయాధికారులు
- పంటలు వేసే ముందు నేలసారవంతం చేసుకోవాలని సూచన


ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్న రైతులు


సాగులో కట్టెజనుము (ఫైల్)

గరుగుబిల్లి: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న వేళ వ్యవసాయాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ప్రధాన పంటలు వేసుకునే ముందు పొలాల్లో పచ్చిరొట్ట సాగు చేసుకుంటే నేల సారవంతమవుతుందని అవగాహన కల్పిస్తున్నారు. సారవంతమైన నేలలో పండే పంట అధిక దిగుబడులు ఇవ్వడంతో పాటు తెగుళ్లు, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. ఖరీఫ్ సాగుకు మరో 40 రోజుల సమయం ఉన్నందున ప్రతీ రైతు తమ పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని, భూసారం పెంచుకోవాలని చెబుతున్నారు. జీలుగు, కట్టెజనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు పొలాల్లో వేసుకుని, పండించడం ద్వారా నేల సారవంతమై, పండించే ప్రధాన పంటలు బాగా పండుతాయన్నారు. అలాగే వర్షాల సమయంలో నేల కోతకు గురికాకుండా కాపాడవచ్చన్నారు. వీటితో పాటు నేలగుల్లబారి నేలలో నీరు ఇంకే పరిస్థితి ఉంటుందన్నారు. ఇవన్నీ మనం వేసుకునే ప్రధాన పంటలు అధిక దిగుబడిని ఇచ్చేందుకు దోహదపడతాయని చెబుతున్నారు. కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల్లో పచ్చిరొట్ట విత్తనాల కోసం వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశారు. ఇదిలా ఉండగా, మండల కేంద్రాల్లోని వ్యవసాయ కార్యాలయాల్లో కూడా పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

**రైతులు సద్వినియోగం చేసుకోవాలి..**



నేలసారవంతానికి దోహదపడే పచ్చిరొట్ట విత్తనాలను ప్రభుత్వమే రాయితీపై సరఫరా చేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. 50 శాతం రాయితీపై లభించే ఈ విత్తనాలను ప్రతీ రైతు కొనుగోలు చేసి, పొలాల్లో చల్లుకోవాలి. పచ్చిరొట్ట సాగు చేసుకుంటే భూసారం మెరుగవుతుంది. పంట బాగా పండుతుంది.

–ఆర్.విజయభారతి, వ్యవసాయాధికారి, గరుగుబిల్లి.

## ఖరీఫ్ సాగుకు సన్నద్ధం


ట్రాక్టరుతో దుక్కి పనులు చేపడుతున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలు వ్యవసాయానికి అనుకూలంగా ఉండడంతో అన్నదాతలు దుక్కి పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు చేపట్టడం వల్లే భూసారం పెరుగుతుందని, పొలాల్లో పదును ఉన్నప్పుడే దుక్కులు చేసుకోవాలని అలా అయితేనే నేల గుల్లబారి నీటిని పీల్చుకునే సామర్థ్యం ఉంటుందని రైతులు చెబుతున్నారు. దుక్కి పనుల తర్వాత పంటలు సాగు చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని అంటున్నారు. ప్రస్తుతం మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, తాడికొండ, పుట్టజమ్ము, చెముడుగూడ, అడ్డంగూడ, కేదారిపురం, దుడ్డుఖల్లు, రేగిడి, కొందుకుప్ప తదితర గిరిజన గ్రామాల్లో వేసవి దుక్కులు ముమ్మరంగా చేపడుతున్నారు.

## బీమా చెక్కు పంపిణీ


మృతుడి కుమార్తెకు చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ రవికుమార్

సీతంపేట: మండలంలోని రాజన్నగూడకు చెందిన సవర సన్నాయి మృతి చెందడంతో అతని కుమార్తె ప్రమీలకు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా చెక్కును (రూ.రెండు లక్షలు) ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ పొంద్రంకి రవికుమార్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవన జ్యోతి బీమా చేయించుకోవడం వల్ల నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సంవత్సరానికి రూ. 436 చెల్లించడం వల్ల సహజ మరణానికి కూడా రూ. రెండు లక్షలు, సురక్ష బీమా కింద 20 రూపాయలు చెల్లిస్తే ప్రమాద బీమాగా రెండు లక్షల రూపాయల పరిహారం వస్తుందని తెలిపారు. బ్యాంక్ ఖాతా ఉన్న వాళ్లందరూ ఈ పథకంలో కచ్చితంగా చేరాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## పశువులకు జబ్బవాపు నివారణ టీకాలు

- ఉల్లిభద్ర పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్


పశువులకు టీకాలు వేస్తున్న ఉల్లిభద్ర పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌కుమార్

గరుగుబిల్లి: మండలంలోని శివ్వాం గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించి, పశువులకు జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఉల్లిభద్ర పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో పశువులు ఎక్కువగా ఈ వ్యాధి బారినపడే అవకాశం ఉందని, ముందస్తు జాగ్రత్తగా పాడిరైతులంతా తమ పశువులకు తప్పనిసరిగా జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయాలని సూచించారు. ఈ వ్యాధి ఎక్కువగా తెల్లజాతి ఆవులు, ఎద్దులకు సోకే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పశువులకు పెట్టే కలుషిత ఆహారం, నీరు కారణంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. మూగజీవాలు ఎటువంటి వ్యాధులకు గురైనా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, పశువైద్య శాలల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి..


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

పాలకొండ రూరల్: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల ఎన్నికల నోడల్ అధికారి, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తాజాగా ముగిసిన ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందిని అధికారులను అభినందించారు. ఫలితాలు వచ్చేవరకు మోడల్ కోడ్ అమల్లో ఉంటుందని గుర్తించాలన్నారు. నిబంధనలు అతిక్రమించవద్దని స్పష్టం చేశారు. ఈ నెల 27న జరగనున్న మండల సర్వసభ్య సమావేశాలకు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

## హద్దులు మీరితే చర్యలు

- డీఎస్పీ కృష్ణారావు


మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని.. ఫలితాలు వచ్చే వరకు ప్రతి ఒక్కరూ సామరస్య వాతావరణంలో మెలగాలని, అలాకాకుండా ఎవరైనా హద్దులు మీరితే చర్యలు తప్పవని డీఎస్పీ జీవీ కృష్ణారావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 11 పోలీస్ స్టేషన్ల ద్వారా గ్రామాల్లో అంతర్గత నిఘా ప్రస్తుతం కొనసాగుతోందన్నారు. ఇదివరకే గుర్తించిన 32 గ్రామాల్లో ప్రత్యేక బలగాల పర్యవేక్షణ ఇంకా ఉందని చెప్పారు. గతంలో జరిగిన ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటలనకు పాల్పడిన, ఆ తరహా మనస్తత్వం గల 3,900 మందిపై బైండవర్ కేసులు, 59 మందిపై రౌడీషీట్ ఉన్నట్లు తెలిపారు. ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, వీరందరిపై పోలీసుల నిఘా ఉంటుందని చెప్పారు.

## డ్రై డే పాటించాలి


కారిగూడలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

భామిని: దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి పి. అప్పారావు, ఎంపీహెచ్ఓ జె.పద్మరాజు సూచించారు. ఈ మేరకు పోలవరం, కారిగూడ గిరిజన గ్రామాల్లో దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీఎం 5 శాతం మందును పిచికారీ చేశారు. డెంగీ, మలేరియా దోమల వల్ల వ్యాపిస్తాయని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక నారాయణ, బాలేరు పీహెచ్‌సీ సిబ్బంది మీనాకుమారి, భారతి, లక్కాయి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆరాధన మహోత్సవాలు


ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో కొలువుదీరిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ ఆలయంలో శుక్రవారం ఆరాధనా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి పైల సుధారాణి, నాగేశ్వరరావు దంపతులు రూ. 50 వేలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో అర్చకుడు పవన్‌కుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.నారాయణరావు, ఎ.ప్రసాదరావు, అర్థముడి బ్రహ్మం, ఎ.కేశవరావు, ఎ.పార్వతీశం, చింతాడ మహేష్, తదితరులు పాల్గొన్నారు.